క్లుప్తంగా

లీకేజీలకు మరమ్మతులు



పైపులైన్‌కు మరమ్మతులు చేయడంతో మామూలుగా మారినరోడ్డు

నర్సాపూర్: మిషన్ భగీరథ పథకం పైపులైన్‌కు పడిన లీకేజీలకు ఆ పథకం అధికారులు మరమ్మతులు చేశారు. సాక్షిలో సోమవారం వచ్చిన వృథాగా భగీరథ నీరు అనే కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు మరమ్మతులు చేపట్టి, నీటి వృథాను అరికట్టారు. ఇదిలా ఉండగా పైపులైన్ మరమ్మతుల కోసం పట్టణంలోకి వచ్చే రోడ్డుతో పాటు జాతీయ రహదారిని తవ్వి పనులు చేపట్టిన అధికారులు గోతులను సరిగా పూడ్చకపోవడం గమనార్హం.

కొనసాగుతున్న రిలే దీక్షలు



నర్సాపూర్ దీక్షల్లో పాల్గొన్న జేఏసీ నాయకులు

నర్సాపూర్: డంప్‌యార్డు వద్దంటూ చేపట్టిన రిలే నిరాహారదీక్షలు మంగళవారం నాటికి 9వ రోజుకు చేరాయి. ప్యారానగర్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న డంప్‌యార్డును ఎత్తి వేయాలన్న డిమాండ్‌తో నర్సాపూర్ జేఏసీ ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలు చేపడుతున్నారు. దీక్షల్లో జేఏసీ నాయకులు రాజేందర్, నాగేందర్‌గౌడ్, ఆనంద్‌కుమార్, కృపాచారి, నరేందర్‌చారి, అంజయ్య, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి



అంగన్‌వాడీ టీచర్ల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధికారి

నర్సాపూర్: అంగన్‌వాడీ టీచర్లు ఆయాలు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని డీడబ్ల్యూఓ హైమావతి సూచించారు. మంగళవారం ఐసీడీఎస్ నర్సాపూర్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్ల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులకు, బాలింతలకు పిల్లలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో స్థానిక సీడీపీఓ హేమభార్గవి, పలువురు సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



నిజాంపేటలో పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న డిప్యూటీ తహసీల్దార్

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో 27న నిర్వహించే పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాన్ని మంగళవారం డిప్యూటీ తహసీల్దార్ రమ్యశ్రీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన్నట్లు తెలిపారు. పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రమేశ్, ఆర్ఐ ప్రీతి పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి



గ్రంథాలయ నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ చైర్ పర్సన్ సుహాసినిరెడ్డి

రేగోడ్(మెదక్): అభివృద్ధికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని జిల్లా గ్రంథాలయ చైర్ పర్సన్ సుహాసినిరెడ్డి కోరారు. మండల కేంద్రం రేగోడ్‌లో గ్రంథాలయ భవన నిర్మాణ స్థలాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ.. రాజా రామ్మోహన్ రాయ్ ఫౌండేషన్ ద్వారా గ్రంథాలయం నిర్మాణ కోసం రూ.50 లక్షల నిధులు కేటాయించామని చెప్పారు. రేగోడ్‌లో గ్రంథాలయ నిర్మాణం పనుల్లో జా ప్యం జరుగుతుండటం పై ఆగ్రహం వ్యక్తం చేశా రు. గ్రంథాలయ నిర్మాణం పనులను అడ్డగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహాశివరాత్రికి ముస్తాబైన శివాలయాలు



హవేళఘణాపూర్(మెదక్): ముస్తాబైన శ్రీసిద్దేశ్వరాలయం

మహాశివరాత్రికి ముస్తాబైన సిద్దేశ్వరాలయం

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని ముత్తాయికోట గ్రామ శివారులో వెలసిన సిద్దేశ్వరాలయాన్ని మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా విద్యుద్దీపాలతో అలంకరించారు. మహాశివరాత్రి సందర్భంగా మంగళవారం ఉపవాస దీక్షల సందర్భంగా రాత్రి భజన కార్యక్రమాలతో పాటు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు గోవింద్‌మహరాజ్ తెలిపారు.

మనోహరాబాద్‌లో..

మనోహరాబాద్(తూప్రాన్): మహాశివరాత్రిని పురస్కరించుకొని పలు గ్రామాల్లో ఆలయాలను ముస్తాబు చేశారు. మండలంలోని లింగారెడ్డిపేట్‌లో అతిపురాతనమైన రాజరాజేశ్వరి దేవాలయం, చెట్లగౌరారంలో చెల్మానాయగుట్ట, పాలాటలో శివాలయం, కాళ్లకల్‌లో బంగారమ్మ దేవాలయం, కాలకంఠేశ్వరాలయం, కూచారంలో కోదండ రామాలయంలతో పాటు పలు దేవాలయాలు ముస్తాబైయాయి. శివరాత్రిని పురస్కరించుకొని కాళ్లకల్, మనోహరాబాద్‌లో పలు పండ్ల దుకాణాలు వెలిశాయి. పండ్ల ధరలు పెరగడంతో సామన్యులకు ఇక్కట్లు తప్పడం లేదు.



లింగారెడ్డిపేట్‌లో ముస్తాబైన రాజరాజేశ్వరి దేవాలయం

రంగంపేటలో..

కొల్చారం(నర్సాపూర్): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని గ్రామాల్లోని శైవ ఆలయాలు ప్రత్యేకంగా ముస్తాబయ్యాయి. బుధవారం మహాశివరాత్రి సందర్భంగా మండల కేంద్రంలోని వీరభద్రాలయం, రంగంపేటలోని సంగమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఉపవాస దీక్షలు ఆచరించే భక్తుల సౌకర్యార్థం దేవాలయాల్లో ఉదయం నుంచి అభిషేకాలు, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.



కొల్చారం(నర్సాపూర్): రంగంపేటలో ముస్తాబైన శివాలయం



గోమారంలో గుట్టపై కొలువైన రామేశ్వరస్వామి

శివ్వంపేటలో..

శివ్వంపేట(నర్సాపూర్): మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని శివాలయాలు ముస్తాబు అయ్యాయి. వందల ఏళ్ల నాటి గూడూర్‌లోని సోమేశ్వరాలయం, పెద్దగొట్టిముక్లలోని ఉమా సంగమేశ్వరస్వామి, గోమారంలో గుట్టపై కొలువైన రామేశ్వరస్వామి, శివ్వంపేటలోని ఉమా మహేశ్వరస్వామి ఆలయాలతో పాటు గ్రామాల్లో కొలువైన పలు ఆలయాల్లో నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.



గూడూర్‌లోని సోమేశ్వర శివలింగం

కొప్పోల్‌లో ప్రారంభమైన ఉత్సవాలు

పెద్దశంకరంపేట(మెదక్): మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని పెద్దశంకరంపేట మండల పరిధిలోని కొప్పోల్ ఉమా సంగమేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం ఉదయం నుంచి పుణ్యాహవాచనం, రుత్విక్ వరణం, అగ్ని ప్రతిష్ఠాపన, దుర్గాభవానీకి అభిషేకం, హోమం తదితర కార్యక్రమాలు వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్చారణలతో నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పెద్దశంకరంపేట(మెదక్): కొప్పోల్ ఆలయంలో..

కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు రాజశేఖర్ రెడ్డి, ఆలయ అర్చకులు సంగప్ప, మహేశ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

వెల్మకన్నలో మల్లికార్జునస్వామి

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్నలోని భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయం, మహమ్మద్‌నగర్‌లోని దుర్గాదేవి ఆలయం మహాశివరాత్రికి ముస్తాబయ్యాయి. మహాశివరాత్రి సందర్భంగా మల్లికార్జునస్వామి ఆలయంలో ఉదయం శివలింగానికి రుద్రాభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు ఉమాశంకరశర్మ తెలిపారు. దీంతో పాటు మధ్యాహ్నం భ్రమరాంబ మల్లికార్జున స్వామి కల్యాణం అనంతరం భక్తుల ఉపవాస దీక్ష విరమణ పూజా కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు.



కౌడిపల్లి(నర్సాపూర్): వెల్మకన్నలో..

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు



రామాయంపేటలో మాట్లాడుతున్న మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

రామాయంపేట(మెదక్): ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు ఆరోపించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి తరఫున మంగళవారం రామాయంపేటలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు విశ్వనాథ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలువడం ఖాయమని పార్టీ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి చెప్పారు. వారు నర్సాపూర్‌లో ఎన్నికల ప్రచారం చేశారు. వారి వెంట పలువురు పార్టీ నాయకులు మల్లేశ్, రిజ్వాన్, శ్రీనివాస్‌గుప్తా, అజ్మత్, రవికుమార్ తదితరులు ఉన్నారు.

కొల్చారం(నర్సాపూర్): ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ మండలంలోని పోతనశెట్టిపల్లి టీ జంక్షన్ వద్దఏఐసీసీ కార్యదర్శి, జిల్లా పార్టీ పరిశీలకుడు విష్ణునాథ్ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన వెంట జిల్లా పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు, మండలాధ్యక్షుడు మల్లేశంగౌడ్, ఉపాధ్యక్షుడు గోవర్ధన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని ఏఐసీసీ కార్యదర్శి, ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు విశ్వనాథన్ కోరారు. ఉమ్మడి మండలంలోని మిర్జాపల్లిలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, డీసీసీ అధ్యక్షుడు అంజనేయులుగౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సత్యానారాయణ, మాజీ ఎంపీపీ అరుణ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలో ఏఐసీసీ కార్యదర్శి, జిల్లా పరిశీలకుడు విష్ణునాథ్ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మాంతరావుస్టేట్ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీనివాసరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతుగా కాంగ్రెస్ నాయకుడు నవీన్‌గుప్తా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ప్రభులింగంగౌడ్, మల్లేశ్, గణేశ్, గౌరీశంకర్ తదితరులు ఉన్నారు.

అశోక్‌కుమార్‌ను గెలిపించండి



మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

తూప్రాన్: ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కోసం నిరంతరం పనిచేసే నాయకుడు అశోక్‌కుమార్ గెలిపించాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరామిరెడ్డి, టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రావు, టీపీటీఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షుడు ముత్యాలు అన్నారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీ ఎఫ్, టీపీటీఎఫ్ ఉమ్మడి సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు రాజేంద్రప్రసాద్, సాయిబాబా, రమేశ్, కిష్టయ్య, శ్రీనివాస్, చిరంజీవి రావు, వెంకటేష్, మల్లేశ్, మనీష్, భాష్య, వేణుగోపాల్, మోహన్ రావు, ప్రవీణ్, కామేష్ పాల్గొన్నారు.

వరిలో సల్ఫైడ్ దుష్ప్రభావ నివారణ

అంసాన్‌పల్లి, వెంకటాపూర్‌లో శాస్త్రవేత్తలు



పొలాలను పరిశీలిస్తున్న ఏరువాక శాస్త్రవేత్తలు

కొల్చారం(నర్సాపూర్): మారిన వాతావరణ పరిస్థితుల్లో వరిలో సల్ఫైడ్ దుష్ప్రభావ లక్షణాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని, నివారణ చర్యలు చేపట్టాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ అన్నారు. మంగళవారం మండలంలోని అంసాన్‌పల్లి, వెంకటాపూర్ గ్రామాల్లో ఏరువాక కేంద్రం సంగుపేట, తోర్నాల వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో వరి పంట పొలాలను పరిశీలించేందుకు ఏరువాక నిర్వహించారు. పై గ్రామాల్లో వరి పొలాలకు పరిశీలించినప్పుడు పంటలో సల్ఫైడ్ దుష్ప్రభావ లక్షణాలను ఎక్కువగా ఉన్నాయన్న విషయాన్ని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పొలంలో దిగినప్పుడు బుడగల రూపంలో నీరు మారి కనిపిస్తుందన్నారు. మొక్కను బయటకు తీసినప్పుడు కుళ్లిన కోడిగుడ్ల వాసన వస్తుందన్నారు. ఈ వ్యాధి లక్షణాలు రావడానికి ప్రధాన కారణం కాంప్లెక్స్ ఎరువులు ఎక్కువగా వాడకం, వేర్లకు సరిగా నీరు అందకపోవడమన్నారు. ఈ వ్యాధి నివారణకు రైతులు నాటు వేసిన పొలాన్ని అప్పుడప్పుడు ఆరబెట్టుతూ ఉండడం, జింక్ సల్ఫేట్ 2 గ్రా. మందును లీటర్ నీటితో కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం తోర్నాల మృత్తిక శాస్త్ర విభాగ శాస్త్రవేత్త డా.శ్రీజయ, ఇన్‌చార్జి జిల్లా వ్యవసాయాధికారి వినయ్ కుమార్, కౌడిపల్లి ఏడీఏ పుణ్యవతి, మండల వ్యవసాయ అధికారి శ్వేతాకుమారి, వ్యవసాయ విస్తరణ అధికారి స్రవంతి, శ్రీకాంత్, ఆయా గ్రామ రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

కౌడిపల్లి జీజేసీ ప్రిన్సిపాల్ వెంకటసుబ్బయ్య



బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపాల్

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యార్థులు ఇష్టంతో శ్రద్ధగా చదివి అభివృద్ధి చెందాలని కౌడిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటసుబ్బయ్య అన్నారు. మంగళవారం కళాశాలలో విద్యార్థులకు వీడ్కోల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. చదువుతోనే సమాజంలో మంచి హోద, గుర్తింపు లభిస్తుందన్నారు. చదువు మాత్రమే ఉన్న స్థానం నుంచి ఉన్నత స్థానానికి తీసుకెళ్తుందన్నారు. చెడు వ్యవసనాలకు దూరంగా ఉండాలన్నారు. వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తేవాలన్నారు. అనంతరం కళాశాలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆట పాటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో లెక్చరర్లు మణికాంత్, గిరధర్, సురేందర్‌రెడ్డి, దుర్గయ్య, భాస్కర్, జానకి, లత, చంద్రం, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

ధన రాజకీయాలను ఓడిద్దాం



ప్రచారం నిర్వహిస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా అశోక్‌కుమార్‌ని గెలిపించాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్‌రామిరెడ్డి అన్నారు. మంగళవారం శివ్వంపేట మండలంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను కలిసి మొదటి ప్రాధ్యానత ఓటు అశోక్‌కుమార్‌కు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ నాయకులు ముత్యాలు, రాజేంద్రప్రసాద్, పురుషోత్తమశర్మ, శ్రీనివాస్ రావు, సంతోష్‌కుమార్ ఉన్నారు.

ఆరు నెలలుగా అందని వేతనాలు



సంచార పశువైద్య సిబ్బంది

తూప్రాన్: పశు సంచార వాహనాల ద్వారా మూగజీవాలకు తక్షణ వైద్య సేవలు అందించేందుకు నియమించిన పశు సిబ్బందికి గత ఆరు నెలలుగా వేతనాలు అందడంలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా వాహనం పైలేట్ నాగేశ్ మాట్లాడుతూ.. వాహనంలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్‌తో పాటు సహాయకులకు ఆరు నెలలుగా ప్రభుత్వం అందించడం లేదని వాపోయారు.

ముగిసిన ప్రచారం.. వైన్స్‌లకు తాళం



కౌడిపల్లిలో వైన్స్‌ను మూసివేసిన ఎక్సైజ్ ఎస్‌ఐ

కౌడిపల్లి(నర్సాపూర్): గురువారం ఎమ్మెల్సీ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికలు ఉండటంతో ఎక్సైజ్‌శాఖ అధికారులు వైన్స్‌లకు తాళం వేశారు. మంగళవారం కౌడిపల్లి ఎక్సైజ్ ఎస్‌ఐ రాఘవేందర్ ఆధ్వర్యంలో సిబ్బంది కౌడిపల్లిలోని రెండు వైన్స్‌లకు తాళం వేశారు. ఈనెల 27న ఎమ్మెల్సీ ఎన్నికలు ఉండటంతో మంగళవారం సాయంత్రం ప్రచారానికి తెరపడింది. దీంతో తాళం వేశారు. ఎన్నికలు ముగిసేవరకు మద్యం అమ్మకాలను చేయొద్దన్నారు.

రేషన్‌బియ్యం అక్రమ నిల్వపై కేసు



పోలీసులు పట్టుకున్న రేషన్‌బియ్యం

వెల్దుర్తి(తూప్రాన్): పట్టణంలోని ఓ కిరాణ దుకాణంలో రేషన్‌బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన ఘటనపై కేసు నమోదు చేసి, విచారణ జరుపుతున్నట్లు సివిల్ సప్లై ఇన్‌స్పెక్టర్ సాయికుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన కైలాష శ్రీనివాస్ కిరాణ దుకాణంలో సోమవారం పోలీసులు దాడిచేయగా, సుమారు మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించారన్నారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్‌బియ్యాన్ని మంగళవారం తమకు అప్పగించగా సదరు దుకాణ యజమాని కైలాష శ్రీనివాస్‌పై కేసు నమోదు చేశామన్నారు. రేషన్‌కార్డు లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు బియ్యాన్ని కొనుగోలు చేసి మార్కెట్లో ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు గుర్తించామన్నారు. గతంలోనూ శ్రీనివాస్ పలుమార్లు రేషన్‌బియ్యం అక్రమంగా నిల్వచేసి తరలించగా పట్టుబడ్డాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఎవరైనా రేషన్‌బియ్యాన్ని తరలిస్తే తమకు సమాచారం అందించాలని ఆయన సూచించారు.

ప్రమాదాల నివారణకు పోలీసుల చర్యలు



ధర్మాసాగర్ మూల మలుపువద్ద ఫిక్సబుల్, స్ప్రింగ్ బోలార్డ్ ఏర్పాటు చేయిస్తున్న సీఐ, ఎస్‌ఐ

కౌడిపల్లి(నర్సాపూర్): ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి, కౌడిపల్లి ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కౌడిపల్లి మండలంలోని 765డీ జాతీయ రహదారి పరిధిలోని తునికిగేట్ శివారు నుంచి కౌడిపల్లి శివారు వరకు ప్రమాదాలు జరిగే స్థలాలు, మూల మలుపులను గుర్తించి రోడ్డుపై ఫిక్సబుల్, స్ప్రింగ్ బోలార్డ్, డార్కైలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్పీ ఆదేశాలతో జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అందులో భాగంగా సుమారు రూ. 4లక్షలతో 15కిలోమీటర్ల పరిధిలో జాతీయ రహదారిపై 200 ఫిక్సబుల్, స్ప్రింగ్ బోలార్డ్, డార్కైలతో డివైడర్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తగా నడపాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దన్నారు. ఏడుపాయల జాతర సందర్భంగా రహదారిపై రద్దీ ఉంటుందని జాగ్రత్తగా వెళ్లాలని చెప్పారు. పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



స్వపరిపాలన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని హస్తాల్‌పూర్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. డీఈఓగా ఆశ్రిత్, ఎంఈఓగా శ్రీలత, హెచ్‌ఎంలుగా రాంచరణ్‌తో పాటు మానస, ప్రవళిక, అఖిల్, లోకేష్‌లు ఒకరోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విదార్థులకు పాఠాలు బోధించినట్లు పాఠశాల హెచ్‌ఎం మోహన్ రావ్ తెలిపారు. ఉత్తమ బోధన చేసిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనిత, శ్రీకాంత్, ప్రణతి, భాగ్యలక్ష్మి, సౌజన్య పాల్గొన్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని సోమ్కపేట్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వయంపాలన దినోత్సవం ఘనంగా జరుపుకొన్నారు. ఒక్కరోజు ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించిన విద్యార్థులు, తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. పాఠశాల విద్యార్థుల్లో కలెక్టర్‌గా అర్చన, డీఈఓగా శ్రీకాంత్, ఏంఈఓగా మహేశ్, ఎంఎస్‌ఓగా శ్రీవాణి, ప్రధానోపాధ్యాయుడిగా వెంకటేశ్, ఉపాధ్యాయులుగా దీపిక, శ్రీజ, నిహారిక, శృతి, శాంతి, లక్ష్మణ్, ప్రసాద్ వంశీ వ్యవహరించారు. ఒక్క రోజు ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తించిన విద్యార్థులను మండల విద్యాధికారి విఠల్, ఉపాధ్యాయులు అభినందించారు.



చిలప్‌చెడ్(నర్సాపూర్): సోమక్కపేట్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి,
జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. లక్ష్మణ్
9502735264